సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



అమ్మభాషకు అక్షర రూపమిద్దాం!

మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలిగేది ఒక్క మాతృభాషలోనే. అలాంటి అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. -8లో



జాడలేని చిట్టిబోయనపల్లె

జిల్లాలోని గుర్రంకొండ మండలం చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామం రెవెన్యూ రికార్డుల్లో కనిపించకుండా పోయింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 66 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

23 నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నెల 23వ నుంచి మార్చి 5 వరకు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం ప్రధాన అర్చకులు, ఆలయ ఈవో రమణారెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

రాయచోటి సబ్ జైల్ తనిఖీ

రాయచోటి టౌన్: రాయచోటి సబ్ జైల్‌ను రాష్ట్ర సేవాధికార సంస్థ ఉమ్మడి కడప జిల్లా సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫకృద్దీన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై విచారణ

గుర్రంకొండ: మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో జరిగిన ఉపాధిహామీ పనుల అవకతవకలపై మండల అధికారులు విచారణ జరిపారు. గ్రామంలో జరిగిన పనుల్లో ఉద్యోగుల పేర్లు, పనిచేయని వారి పేర్లతో బిల్లులు చేసుకున్నారని గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలమేరకు ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డిలు గురువారం విచారణ నిర్వహించారు. విచారణ శుక్రవారానికి పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించినున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

మదనపల్లెలో పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం?

మదనపల్లె: పట్టణంలోని చంద్ర కాలనీలో పెద్ద మొత్తంలో (80 కిలోలకు) పైగా గంజాయిని గంగవరం పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. గురువారం మధ్యాహ్నం పోలీసులు తమకు గంజాయి కేసులో దొరికిన నిందితుడిని విచారిస్తుండగా మదనపల్లె పట్టణం చంద్ర కాలనీలో పెద్ద మొత్తంలో గంజాయి నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి చేరుకొని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో సుమారు 80 కిలోల పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది...తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.... పట్టుబడిన గంజాయి, ముగ్గురు నిందితులను టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. తర్వాత నిందితులను, గంజాయిని డీఎస్పీ కార్యాలయానికి తరలించి, ఎక్కడ నుంచి రవాణా జరిగింది ఇందులో కీలక సూత్రధారులు ఎవరు, ఎన్నాళ్లుగా జరుగుతుంది అనే విషయమై విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడును గంజాయి స్వాధీనం చేసుకున్న విషయమై వివరణ అడిగితే... తమకు గంగవరం పోలీసుల నుంచి సమాచారం వచ్చింది వాస్తవమేనని, స్థానిక పోలీసులతో బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సరుకు స్వాధీనం చేసుకోవడం, నిందితులను అదుపులోకి తీసుకోవడం చేయలేదన్నారు. అయితే మదనపల్లె పట్టణంలో గంజాయి పెద్ద మొత్తంలో దొరకడం వెనక ఇంటిలిజెన్స్, ఎస్బి పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

బి.కొత్తకోట ఎంపీపీపై అవిశ్వాసం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండల పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మపై వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం కోరుతూ ఎంపీడీఓ మంగళం శంకరయ్యకు ఈనెల 10న నోటీసు అందజేసిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. 2020 మార్చిలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మండలానికి చెందిన 11 మంది ఎంపీటీసీలు ఎన్నికయ్యారు. తర్వాత కోవిడ్ ప్రభావంతో 2021 సెప్టెంబర్ 19న ఎంపీటీసీ సభ్యులుగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ ఎన్నిక అనంతరం గుమ్మసముద్రం ఎంపీటీసీ లక్ష్మీనరసమ్మను ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో 11 మంది ఎంపీటీసీల్లో తొమ్మిది మంది ఆమెపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఎంపీడీఓకు నోటీసు అందించారు. ఈ నోటీసులో సంతకాలు చేసిన ఎంపీటీసీల్లో వి.ఖాదర్‌వలీ (తుమ్మనంగుట్ట), ఎస్.రాధ (సూరపువారిపల్లి), వి.రామసుబ్బారెడ్డి (నాయనబావి), సి.ఎల్లప్ప (బీరంగి),ఎ.సుబ్బయ్య (బడికాయలపల్లి), ఎ.గౌతమి (మొటుకుపల్లి), బి.ఈశ్వరమ్మ (కోటావూరు), సి.విమలమ్మ (గోళ్లపల్లి), ఆకుల బాలకృష్ణ (గట్టు) ఉన్నారు. మిగతా రెండు ఎంపీటీసీల్లో ఒకరు ఎంపీపీ కాగా మరొకరు బయ్యప్పగారిపల్లి ఎంపీటీసీ ఎ.రమాదేవి ఉన్నారు. ఈ అవిశ్వాస నోటీసులో..ఎంపీటీసీలైన తమ పట్ల ఎంపీపీ నియంతృత్వ పోకడలతో వ్యవహరిస్తూ అభివృద్ధి ప్రతిపాదనలను ఖాతరు చేయడం లేదని పేర్కొన్నారు. కాగా ఈ అవిశ్వాస నోటీసుపై గురువారం చిత్తూరు జెడ్పీ కార్యాలయంలో అధికారులు చర్యలు చేపట్టారు.

చిగురిస్తున్న ఆశలు!

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కనిపిస్తున్న మామిడి పూత
- జిల్లా వ్యాప్తంగా సుమారు 30 రకాలకు పైగా మామిడి సాగు
- యాజమాన్య పద్ధతులు పాటించాలని నిపుణుల సూచన



మామిడి పూత



పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్లు

సాక్షి రాయచోటి: మామిడి రైతుల ఆశలు చిగురుస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో...అనుకోకుండా వచ్చిన తుఫాన్లు, మంచు ప్రభావంతో జనవరి చివరి వరకు పూత కనిపించలేదు. అయితే పరిస్థితులు మారడం, ఎండ ప్రభావానికి తోడు ఆలస్యంగా పూత వస్తుండడంతో మామిడి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం తోటల్లో ఎక్కడ చూసినా పూతతో చెట్లు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే అరకొరగా పూతతో కనిపించిన చెట్లు ప్రస్తుతం పిందెలతో దర్శనమిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 37 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉండగా, అందులో సుమారు 30 రకాలకు పైగా మామిడి కాయలను సాగు చేస్తున్నారు.

ఆలస్యంగా కనిపిస్తున్న పూత

జిల్లాలోని మామిడి తోటల్లో ప్రస్తుతం పూత కనిపిస్తోంది. మామిడి పంటకు సంబంధించి సాధారణంగా డిసెంబరు, జనవరిలోనే పూత కనిపించాల్సి ఉండగా, ఈసారి ఆలస్యంగా అగుపిస్తోంది. చాలామండలాల్లో ఇప్పుడిప్పుడు పూత వస్తుండడంతో మామిడి రైతులు పంటపై ఆశలు పెట్టుకుంటున్నారు. మరోప్రక్క పూత రాలిపోకుండా వేగవంతంగా పురుగుమందులను పిచికారి చేస్తూ కాపాడుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఏది ఏమైనా ఆలస్యంగానైనా పూత రావడంతో మామిడి రైతుల్లో ఆశల మొసులు వికసిస్తున్నాయి. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి సాగు

జిల్లాలో సుమారు 37 వేల హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించాయి. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలో అధికంగా మామిడి సాగు ఉండగా, ఆతర్వాత రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల్లోనూ మామిడి తోటలు సాగులోఉన్నాయి. ఏడాదికేడాదికి మామిడి సాగు పెరుగుతూ వస్తోంది. రానురాను మామిడికి జిల్లా ప్రసిద్ధి చెందుతోంది. అన్ని రకాల కాయలను సాగు చేస్తూ ఇక్కడి రైతులు ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు చేస్తున్నారు. ఈసారి పూత ఆలస్యంగా రావడంతో రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే పూతకు తగ్గట్టుగా కాయలు దిగుబడి రావాలని రైతాంగం ఆశిస్తోంది.

నాలుగు నెలలపాటు మార్కెట్‌లో కాయలు



జిల్లాలో పండించిన పంటకు ఇతర రాష్ట్రాల్లో కూడా డిమాండ్ ఉంటుంది. ఇక్కడ బేనీషా, లాల్ బహార్, బెంగుళూర, నీలం, మల్‌గూబ, తోతాపురి, ఇమామ్ పసంద్‌తోపాటు ఇతర అనేక రకాల కాయలు మార్కెట్‌లోఉంటాయి. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలోని మార్కెట్ మామిడితో కళకళలాడనున్నాయి. అంతేకాకుండా రైల్వేకోడూరు మార్కెట్ నుంచి ఢిల్లీ, హరియాణ, చండీఘర్, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం కాయలు రవాణా అవుతుంటాయి. అంతేకాకుండా జిల్లాలోని వీరబల్లి ప్రాంతంలో పండించిన బేనీషాకు అధిక డిమాండ్‌ఉంటుంది. కాయలు నాణ్యతతో ఉండడంతోపాటు మంచి రంగుతో రుచికరంగా ఉండడంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం ఈ ప్రాంత మామిడిని ఇష్టపడుతున్నారు. జిల్లాలో మామిడికాయలు ఏప్రిల్ నుంచి జులై వరకు నాలుగునెలలపాటు మార్కెట్లలో సిద్ధంగా ఉండనున్నాయి.

మహా సంప్రోక్షణకు ఏర్పాట్లు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన వెంటనే నిర్వహించే మహా సంప్రోక్షణకు తిరుమల–తిరుపతి దేవస్థానం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన గోపురాన్ని భక్తులు వీక్షించేందుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. కొన్ని నెలల తర్వాత గర్భాలయంలోని సీతారామ లక్ష్మణ మూర్తుల దర్శన భాగ్యం కల్పించనున్నందున ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమం ఉంటుందని టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 6 నుంచి 8 వతేదీ వరకు సాయంత్రం 5 గంటలకు అఖండ రామనామ భజన సంకీర్తనలు, శ్రీమద్రామాయణ సంగీత స్వరార్చన, రామాయణ ఉపన్యాసాలు జరుగుతాయన్నారు.

అధికారులూ.. మీకిది తగునా?

టాస్క్ ఫోర్స్: ప్రజా ప్రతినిధులతో అధికారులు కలవడం పాలనలో ఒక భాగం..కానీ నేడు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులతో అంట కాగుతూ...వారి సేవల్లో కొంతమంది అధికారులు విధులకు డుమ్మా కొట్టి తరిస్తుండటంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది వారి విధులను ప్రక్కన పెట్టి రాజకీయ నాయకుల దృష్టిలో పడేందుకు అనేక రకాల పాట్లు పడుతున్నారు. ఈ కోవలోనే జిల్లాకు చెందిన మంత్రి మేనల్లుడు తిరుమలకు వెళుతుండగా ఆయన ఆశీస్సుల కోసం రాయచోటికి చెందిన కొంతమంది మున్సిపల్, పోలీస్, ఇతర శాఖలకు చెందిన అధికారులు పూల బొకేలు, భారీ దండలతో స్వాగతాలు పలకడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఉన్నతాధికారుల సైతం ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడానికి భయపడుతున్నట్లు తెలియవచ్చింది. అధికారులారా మీకు ఇది తగునా అంటూ అనేక మంది చర్చించుకోవడం విశేషం.



మంత్రి మేనల్లుడికి గజమాలతో స్వాగతం పలుకుతున్న వారిలో ఒకరు పోలీసు, మరొకరు మున్సిపల్‌శాఖలోని అధికారి

పి-4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: పేదరిక నిర్మూలన – పి4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, వాట్సాప్ పరిపాలన ద్వారా ప్రజలకు అత్యంత చేరువలో సేవలు ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్–2 పరీక్ష, పేదరిక నిర్మూలన – పి4 సర్వే, ఇంటర్మీడియట్ పరీక్షలు, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, వాట్సాప్ పరిపాలన, ఎమ్మెస్ఎంఈ సర్వే, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మధుసూదన్ రావు, సిపిఓ వెంకట్, డీఈఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమీషనర్ వాసు తదితర అధికారులు పాల్గొన్నారు.



కూల్చివేసిన దళితుల గృహాలు

దళితులపై దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్‌గా కక్షసాధింపు
- ముగ్గురికి సంబంధించిన గృహాల కూల్చివేత
- బాధితులను పరామర్శించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్: కూటమి నాయకుల దాష్టీకాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి.వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్‌గా కక్షసాధింపు చర్యలు ఎక్కువయ్యాయి. అన్నమయ్య జిల్లా రాజంపేటలో దళితుల గృహాలు కూల్చివేయడమే ఇందుకు నిదర్శనం. వివరాలు.. రాజంపేట మండల పరిధిలోని కూచివారిపల్లి పంచాయతీ కొమ్మివారిపల్లి దళితవాడలో వైఎస్సార్‌సీపీకి చెందిన గొంటు సుబ్బమ్మ, మద్దూరి సుబ్బలక్ష్మి, గొంటు ఈశ్వరమ్మలు ప్రభుత్వం అందజేసిన భూమిలో గృహాలను నిర్మించుకున్నారు.జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలతో సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి, తహసీల్దార్ పీర్‌మున్నీ, మన్నూరు సీఐ మహమ్మద్ అలీ దగ్గరుండి గృహాల కూల్చివేతకు బుధవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. పోలీసు బలగాలు, జేసీబీలతో రెవెన్యూ అధికారులు దళితవాడ వద్దకు వచ్చారు. తమ వద్ద ఉన్న పట్టాలను దళితులు చూపించినా కనికరం చూపలేదు. నోటీసులు ఇవ్వకుండా వచ్చారు కదా సమయం ఇవ్వండి అని వేడుకున్నా కరుణించలేదు. పేదలం.. గృహాలను కూల్చవద్దని ప్రాధేయపడినా వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల పహారాలో బుధవారం రాత్రి 10గంటల వరకు కూల్చివేతలను కొనసాగించారు. ప్రభుత్వ భూమి అని చెబుతున్నా రెవెన్యూ అధికారులు దళితుల గృహాల పక్కనే ఉన్న కూటమి ప్రభుత్వానికి చెందిన వారి గృహాల వైపు కన్నెత్తి కూడా చూడక పోవటం గమనార్హం.

దళితుల గృహాలను కూల్చివేయటం దుర్మార్గపు చర్య: ఆకేపాటి



ఎమ్మెల్యే ఆకేపాటికి తమ గోడు తెలుపున్న దళితులు

2 సంవత్సరాల కిందట దళితులు నిర్మించుకున్న గృహాలను అధికార యంత్రాంగం దౌర్జన్యంగా కూల్చివేయటం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మండి పడ్డారు. కొమ్మివారిపల్లి దళితవాడలో బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేసిన దళితుల గృహాలను గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఆకేపాటి రాగానే దళితులు పెద్ద ఎత్తున రోదిస్తూ తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. రెక్కాడితే కానీ డొక్కాడని దళితులమైన మేము అగ్రకులాల వారి మధ్య గృహాలను నిర్మించుకున్నందున కుల వివక్షతో కూల్చేశారని బోరున విలపించారు. కూల్చవద్దని ప్రాధేయ పడుతున్నా వినలేదని, మహిళలు అని చూడకుండా మా జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లారంటూ విలపించారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు జిల్లా అభివృద్ధికి దోహదపడాలి కానీ కూల్చివేతలకు ఆదేశాలివ్వడం తగదన్నారు. అధికారులు పక్ష పాత ధోరణి విడనాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో గృహాలను కూల్చివేయాల్సిన అవసరం అధికారులకు ఏముందని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సమస్యలు సృష్టిస్తే సహించేది లేదన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఎపుడూ లేని విష సంస్కృతికి బీజం వేసేందుకు కూటమి నాయకులు ప్రయత్నించటం సరి కాదన్నారు. దళితులకు నష్ట పరిహారం చెల్లించి, గృహాలను నిర్మించే వరకు పోరాటం చేస్తామని తెలియజేశారు. దళితులను ఆదుకోవల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నరు.

- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఏబీ సుదర్శన్‌రెడ్డి, మూరి గోవర్ధన్‌రెడ్డి, పాటూరు భరత్‌కుమార్ రెడ్డి, అనుదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీ.విశ్వనాథరెడ్డి, కే. గోపిరెడ్డి, జీవీ కృష్ణారావు, జీ. త్రినాథ్, డి. బాస్కర్‌రాజు, శంకరయ్యనాయుడు, ఏ.సౌమిత్రి, ఎస్.నవీన్‌కుమార్, ఏ. వరదరాజు, దండు గోపీ, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, ఆర్.కమలాకర్, ఆర్.గురుమూర్తి, ఏ.మధుబాబు, కె.రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులు విలవిల!

- ఎండ తీవ్రతతో అల్లాడుతున్న మూగ జీవాలు
- అడవిదాటుతున్న నేపథ్యంలో.. ప్రాణాలకు ముప్పు
- ప్రత్యామ్నాయం చేపట్టని సర్కారు



అడవిలో నీటి కోసం నెమలి వెతుకులాట



సాసర్‌పిట్‌లో నీటితో నింపుతున్న అటవీ సిబ్బంది (ఫైల్)

రాజంపేట: వేసవి ముంచుకోస్తోంది.. ఫిబ్రవరి మాసం నుంచే వన్యప్రాణులు దాహార్తితో అలమటిస్తున్నాయి.అడవిని దాటుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వన్యప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకున్నారు. వీటి సంరక్షణకు అవసరమయ్యే నిధులను ఇప్పటి ప్రభుత్వం సరిపెట్టలేకపోతోందన్న అపవాదును మూటకట్టుకుంది. కంపానిధులు, బయోసాట్ పథకాల కింద నిధులు విడుదల కాలేదు. దీంతో నీటి ట్యాంకర్లతో నీటిని నింపేందుకు అటవీశాఖ ఆపసోపాలు పడుతోంది. వేసవిలో వన్యప్రాణులు సంరక్షణపై నీలినీడలు అలుముకున్నాయి.

రేంజ్‌లిలా..

వైఎస్సార్ జిల్లా రేంజ్ పరిధిలో కడప, ఒంటిమిట్ట, సిద్ధవటం, వేంపల్లె, ముద్దనూరు, ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల ,బద్వేలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా పరిధిలో రాజంపేట, చిట్వేలి, సానిపాయి, బాలపల్లె, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, పీలేరు రేంజ్‌లున్నాయి.

జనారణ్యంలోకి..

ఉభయ జిల్లాలో ఉన్న అభయారణ్యాల్లో వన్యప్రాణులు నీటి కోసం అలమటిస్తున్నాయి. అవి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శేషాచలం, లంకమల అభయారణ్యం, పెనుశిల అభయారణ్యాల్లో వీటి దాహార్తి తీర్చేందుకు అటవీపల్లెల వైపు చూస్తున్నాయి. మరోవైపు అడవికి నిప్పురాజుకున్న క్రమంలో వన్యప్రాణాలు గందరగోళ పరిస్థితులో పడి ప్రాణాలు కాపాడుకునేందుకు అటవీ శివారుపల్లె వైపు పరుగులు తీస్తున్నాయి. మరికొన్ని ఆహారం, నీటి కోసం కూడా వచ్చి ప్రాణాలు పొగుట్టుకుంటున్నాయి. గురువారం సిద్ధవటం రేంజ్‌లో ఇలాంటి సంఘటన చోటుచేసుకున్న సంగతి విధితమే.

జిల్లా	రేంజ్‌లు	విస్తీర్ణం(హెక్టారు)
వైఎస్సార్	9	2లక్షల94వేలు
అన్నమయ్య	8	2లక్షల74వేలు


అభయారణ్యాలు: శేషాచలం, లంకమల, పెనుశిల, నల్లమల

- వేసవి ప్రారంభానికి ముందే ఫిబ్రవరి మాసంలోనే భానుడు ప్రచండ నిప్పులు చెరుగుతున్నాడు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇక అటవీ ప్రాంతంలో గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరకడం గగనంగా మారడం గమనార్హం.భానుడిసెగతో వన్యప్రాణులు విలవిల లాడుతున్నాయి.

పగలు కన్నా..రాత్రుల్లోనే నీటికోసం..

అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణులు పగలుకన్నా..రాత్రుల్లోనే నీటికోసం అటవీ గ్రామాల శివారుల్లోకి వచ్చేస్తున్నాయి. రాత్రి వేళలో తోటల్లోకి వచ్చి నీటి కోసం పరుగులు తీస్తున్నాయని ప్రత్యక్షంగా చూసిన రైతులు అంటున్నారు. వీటి వల్ల తోటలకు ఎటువంటి హాని ఉండదని, ఏనుగులతో హాని ఉంటుందని చెబుతున్నారు. తెల్లవారుజాము వరకు మైదాన ప్రాంతంలోనే దాహార్తి తీర్చుకొని సేద తీరుతుంటాయి. గుక్కెడు నీటి కోసం పక్షులు, జంతువులు నీటి చలమలను వెతుకొంటూ వస్తున్నాయి.

ఏవేవి వస్తున్నాయంటే..



అటవీ ప్రాంతంలో జింకలు, దుప్పిలు, కొండగొర్రెలు, అడవి బర్రెలు, అడవి పందులు, నెమళ్లు, చిరుతలు, పెద్దపులి, హనిబాడ్జర్,మనుబోతు, కణుజు, రోషకుక్కలు, తోడేళ్లు, నక్కలు, ఎలుగుబంట్లుతోపాటు ఇతర జంతువులు, పక్షులు నీటి కోసం జననివాసాల వైపు అడుగులు వేస్తున్నాయి. సంచరించే ప్రాంతంలో నీటి వనరులు లేనప్పుడే ఈ పరిస్థితులు ఆవిర్భవించనున్నాయి.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



వన్యప్రాణాలు దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.ఫిబ్రవరి నుంచి వేసవి పరిస్థితులు తీవ్రంగా ఉన్నట్లు కనిపిస్తోంది. సాసర్‌పిట్, నీటి కుంటల్లో నీటిని నింపుతాము. 130 సాసర్‌పిట్స్‌లో రెండురోజులకొకసారి నీటితో నింపుతున్నాం. వన్యప్రాణులతో పాటు అడవులను కాపడుకునే బాధ్యత తీసుకున్నాం.

–జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీ అధికారి, రాజంపేట

క్లుప్తంగా

రాజంపేట బైపాస్‌లో వృద్ధుడి దుర్మరణం


మృతి చెందిన చాడు సాహెబ్

రాజంపేట : రాజంపేట బైపాస్ రహదారిలో గురువారం సుంకేసుల చాడుసాహెబ్(68) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తెల్లవారుజామున ఉస్మాన్ నగర్‌లోని తన కుమారుడి టీ దుకాణం వద్ద నుంచి బైపాస్‌లోకి బయలుదేరాడు. బైపాస్ క్రాస్ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

సిద్దవటం : మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం స్వాధీనం చేసుకున్నామని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. సిద్దవటం మండలం దేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన ఒక రైతు 100 డయల్ ఫోన్ కాల్ ద్వారా ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేయడంతో ఒంటిమిట్ట సీఐ బాబు ఆదేశాల మేరకు తమ సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. దేగనవాండ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో 3 ఇసుక ట్రాక్టర్లను, బండికనుమ వద్ద నుంచి కడపకు వెళుతున్న 2 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను సిద్దవటం పోలీసు స్టేషన్‌కు తరలించి, కడప మైన్స్ అధికారులకు రెఫర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు రామకుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

వేగంగా వెళుతున్న వాహనంలో మంటలు


గుర్రంకొండ వద్ద వాహనంలో మంటలు చెలరేగడంతో కాలిపోయిన దృశ్యం

గుర్రంకొండ : వేగంగా రోడ్డుపై వెళుతున్న బొలేరో వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పి, వాహనం ముందు భాగం మొత్తం కాలిపోయిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పెద్దమండ్యం మండలానికి చెందిన రెడ్డెయ్య అనే వ్యక్తి టమాటా లోడుతో గురువారం కలకడ టమాటా మార్కెట్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో గుర్రంకొండకు సమీపంలోని శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద బొలేరో వాహనం ముందుభాగం ఇంజిన్ వైపు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో డ్రైవర్ రెడ్డెయ్య ఉక్కిరిబిక్కిరి అయిపోయి వెంటనే వాహనం నిలిపేసి దిగిపోయాడు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడి వాహనం ముందుభాగం మొత్తం కాలిపోయింది. వాహనంలోని ఇంజిన్ భాగంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఉంటాయని అనుమానిస్తున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మభాషకు అక్షర రూపమిద్దాం!

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



మదనపల్లె సిటీ : మనకు ఎన్ని భాషలు తెలిసినా మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలిగేది ఒక్క మాతృభాష లోనే. అలాంటి కమ్మనైన అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందులో భాగంగానే వారి వారి మాతృభాషల పరిరక్షణకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భాషలు కనుమరుగు కాకుండా కాపాడుకోవడమే లక్ష్యంగా యునెస్కో ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. నాటి నుంచి వారి వారి మాతృభాషలను గౌరవించుకుంటున్నారు. కనీసం 30 శాతం మంది వారి మాతృభాషలను నేర్చుకోకపోయినా.. మాట్లాడకపోయినా ఆ భాష ఉనికికే ప్రమాదమని హెచ్చరించింది.

గతం.. ఎంతో ఘనం

రాజులు, నవాబుల పరిపాలనలో రాజ్యమేలిన భాషలు తెలుగు, ఉర్దూ. ఈ భాషలు రానురాను ప్రాభవం కోల్పోతున్నాయి. నేడు పాలనలో, పాఠశాలల్లో, ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ మాతృభాషలు అటు తెలుగు, ఇటు ఉర్దూ అమలు అరకొరగానే ఉంది.

తెలుగు వెలుగు కోసం..

తెలుగు వెలుగు కోసం పాలకులు చొరవ చూపాలని తెలుగు భాషాభిమానులు సూచిస్తున్నారు. తెలుగుభాషా రక్షణ, భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి తెలుగు అభివృద్ధి సాధికార సంస్థను నిధులు, విధులతో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

మాతృభాషల అభివృద్ధికి ఇలా చేయాలి..

- రాష్ట్ర స్థాయిలో అధికార భాష, ద్వితీయ అధికార భాష అయిన తెలుగు, ఉర్దూలను నిర్బంధంగా అమలు చేయాలి.
- గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఉత్తర ప్రత్యుత్తరాలు మాతృభాషలో కూడా జరగాలి.
- ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి శాశ్వత భవనం ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు తెలుగు, ఉర్దూభాషాభివృద్ధికి వినియోగించాలి.
- పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు మాతృభాషలను నిర్బంధంగా అమలు చేస్తూ ప్రాథమిక స్థాయి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి.
- తెలుగు, ఉర్దూ అకాడమీలను, అధికారభాషా సంఘాలకు అధికారులు, నిధులు, విధులు ఇచ్చి స్వయం ప్రతిపత్తి కల్పించి భాషాభివృద్ధికి కృషి చేయాలి.
- పోటీ పరీక్షలన్నింటినీ ఆంగ్లంతో పాటు తెలుగు, ఉర్దూ మాధ్యమ అభ్యర్థులకు 5 శాతం అదనపు మార్కులు కలిపి ప్రశ్నాపత్రాలను తెలుగు, ఉర్దూలో కూడా ఇవ్వాలి.

జాతి మనుగడకు భాషే ఆధారం



అమ్మ ఉగ్గుపాలతో నేర్చుకున్న భాషను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత తెలుగువారైన మనందరిపైనా ఉంది. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు మన తెలుగుభాషను అందించాలి. ఒక జాతి మనుగడ, వారు మాట్లాడే మాతృభాషపైన ఆధారపడి ఉంటుంది. తెలుగు భాషాభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన తెలుగు అకాడమీలను బలోపేతం చేయాలి. – టీఎస్‌ఏ కృష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె.

అందరి బాధ్యత



అమ్మభాషలో ఉన్న కమ్మదనం ఇతర భాషల్లో ఉండదు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విడవరాదు. ఇది ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా అందరూ సమిష్టిగా మాతృభాషాభివృద్ధికి చొరవ చూపాలి.
– వీఎం నాగరాజు, మరసం సభ్యులు, మదనపల్లె.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నేటి తరం పిల్లలకు అమ్మభాషపై ఆసక్తి కలిగించేందుదకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఒక భాష విలసిల్లాలంటే దాన్ని మాట్లాడే వ్యక్తులు అధికంగా ఉండాలి. పరభాషలు నేర్చుకునే ప్రయత్నంలో అమ్మభాషకు అన్యాయం చేయకూడదు. – అంజలి, ఉపాధ్యాయురాలు, మదనపల్లె.

ద్వితీయ అధికార భాషగా ఉర్దూను అమలు చేయాలి



రాష్ట్రంలోని 13 జిల్లాలలోనూ ఉర్దూను ద్వితీయ అధికార భాషగా అమలు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులున్నా అమలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. తెలుగుతో సమానంగా ఉర్దూలో కూడా కార్యాలయాల్లో ఉత్తర, ప్రత్యుత్తర కార్యక్రమాలు అమలు చేసి ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి. ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు, డైట్‌లలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి. ఒక జాతి మనుగడ వారు మాట్లాడే మాతృభాషపైన ఆధారపడి ఉంటుంది.
– మహమ్మద్‌ఖాన్, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మదనపల్లె.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

– మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.

బాల్య వివాహంపై ఏఎస్పీ విచారణ


బాల్య వివాహంపై విచారిస్తున్న ఏఎస్పీ మనోజ్ హెగ్డే

పెనగలూరు : పెనగలూరు మండలం, ఈటమాపురం గ్రామానికి చెందిన ఓ బాల్య వివాహంపై ఏఎస్పీ మనోజ్ హెగ్డే గురువారం విచారణ చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో ఈ బాల్య వివాహంపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహం 2024లో జరిగినట్లు తెలిసింది. ఈ కేసుపై పూర్తి వివరాలు సేకరించాలని ఎస్‌ఐను ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో కేసుల పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్‌లో రికార్డులను కూడా ఏఎస్పీ పరిశీలించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ రమణ, పెనగలూరు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాలివీడు యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన ఫకీర్‌బాషా

గాలివీడు : తిరుపతి జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె పంచాయతీ కస్పాకు చెందిన షేక్ ఫకీర్ బాషా(21) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షేక్ హిదాయతుల్లా, రషీదా దంపతుల ఇద్దరు సంతానంలో కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఫకీర్ బాషా తిరుపతిలోని మోహన్ బాబు కాలేజీలో బి.ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సహచర విద్యార్థినితో కలిసి ద్విచక్రవాహనంపై వివాహానికి వెళ్లి వస్తుండగా నాయుడుపేట– పూతలపట్టు ప్రధాన రహదారిలో టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. చదువు పూర్తి చేసుకుని తమకు చేదోడు వాదోడుగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. చిన్నవయసులోనే నిండు నూరేళ్లు నిండిపోయాయా అంటూ కుటుంబ సభ్యుల రోదనలతో బోరెడ్డిగారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె : ఒంటరి జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ సిద్ధమ్మగారి పల్లెకు చెందిన కృష్ణప్ప, హసీనాబీ దంపతులకు బి.శంకర్ బాబు, బి.గిరి(45) ఇద్దరు కుమారులు ఉన్నారు. శంకర్ బాబుకు వివాహమై మదనపల్లెలో నివాసం ఉండగా, గిరికి వివాహం కాకపోవడంతో తల్లి హసీనాబీతో కలిసి ఉపాధి నిమిత్తం బెంగళూరులో ఉండేవాడు. ఏడాది క్రితం తండ్రి కృష్ణప్ప మరణించడంతో స్వగ్రామం సిద్ధమ్మగారి పల్లెకు వచ్చి అప్పటినుంచి ఇక్కడే ఉంటున్నారు. స్థానికంగా కూలి పనులకు వెళ్తూ జీవించేవారు. వివాహ వయసు దాటినా పెళ్లి కాకపోవడంతో, గిరి తీవ్ర మనస్తాపానికి గురై వ్యసనాలకు బానిసయ్యాడు. మద్యం మత్తులో పనులకు సైతం వెళ్లకుండా ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మనస్తాపంతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లోనికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతున్నాడు. దీంతో తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రైలు కింద పడి..

కురబలకోట : కురబలకోట–సీటీఎం రైల్వే మార్గంలో బుడ్డారెడ్డిగారిపల్లె సమీపంలో గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ధర్మవరం నుంచి నర్సాపూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో బుడ్డారెడ్డిగారిపల్లె వద్దకు రాగానే ఒక్కఉదుటున రైలు కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైలింజన్ డ్రైవర్ ఫిర్యాదు చేసినట్లు కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ బాషా తెలిపారు. శరీరం గుర్తుపట్టలేనంతా ముద్దగా మారింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనారోగ్యంతో..

మదనపల్లె : అనారోగ్యంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని బసినికొండకు చెందిన రామిరెడ్డి కుమారుడు పద్మనాభ రెడ్డి (57) పిండి మిషన్ నడుపుతూ జీవించేవాడు. ఇతనికి భార్య శ్రావణి, కుమార్తె భవ్య శ్రీ , కుమారుడు జస్వంత్‌రెడ్డి ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నాడు. పద్మనాభ రెడ్డి గత మూడు సంవత్సరాలుగా పేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వారం రోజుల క్రితం అతని చెల్లెలు అనారోగ్య కారణాలతో మృతి చెందింది. ఈ కార్యానికి హాజరయ్యేందుకు వచ్చిన బంధువులు ఇంట్లోనే ఉన్నారు. తనకు వ్యాధి నయం కాలేదన్న మనస్థాపంతో పుంగనూరు రోడ్డులోని మొలకలదిన్నె సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని వద్ద సూసైడ్ నోట్ లభించింది. అనారోగ్యంతోనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన మరణానికి ఎవరూ కారణం కాదంటూ పేర్కొన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

మదనపల్లె : పెట్రోల్ బంకు వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ, తారాస్థాయికి చేరి ఇరు వర్గాల మధ్య దాడికి దారితీసింది. గురువారం రాత్రి మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డు లోని పెట్రోల్ బంక్ వద్ద అరవ వాండ్ల పల్లెకు చెందిన గణేష్, కృష్ణాపురానికి చెందిన హరిల మధ్య వాహనాలకు పెట్రోల్ నింపుకునే విషయమై వివాదం తలెత్తింది. దీంతో ఇరువురు గొడవపడ్డారు. హరి, గణేష్ పై దాడి చేసి కొట్టాడు. ఈ విషయాన్ని గణేష్ తన గ్రామంలోని వారికి తెలియజేశారు. దీంతో 50 మందికి పైగా అరవవాండ్లపల్లి నుంచి కృష్ణాపురం వద్దకు చేరుకున్నారు. ఇది గమనించిన హరి తమ వర్గీయులకు సమాచారం అందించడంతో వారు సైతం పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలు కర్రలతో దాడి చేసుకున్నారు. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కళా వెంకటరమణ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

ఆలయ కమిటీ సభ్యుల నుంచి ప్రాణహాని


మాట్లాడుతున్న వాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు లోకనాథ్ దీక్షిత్

మదనపల్లె : రామసముద్రం మండలం బల్లసముద్రం గ్రామంలోని వాలీశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆలయ అర్చకులు లోక్ నాథ్ దీక్షిత్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఆలయానికి వంశ పారంపర్యంగా తమ కుటుంబ సభ్యులే ప్రధాన అర్చకులుగా ఉన్నారన్నారు. ఆలయంలో పూజా కైంకర్యాలు నిర్వహించేందుకు 124 ఎకరాల ఇనాము భూములు ఉన్నాయన్నారు. ఐదు లక్షల లోపు ఆదాయం ఉన్న ఈ ఆలయానికి ఇటీవలే ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం క్యూ లైన్లు ఏర్పాటు, షామియానాలు, ఇతర సౌకర్యాలను, సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ ప్రధాన అర్చకుడైన తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. దీంతో ఆలయ ఆవరణలో క్యూ లైన్లు ఏర్పాటు చేస్తుండగా, నూతనంగా నియమితులైన ఆలయ కమిటీ సభ్యులు నందకుమార్, మల్లికార్జునలు తనపై దౌర్జన్యం చేస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశారన్నారు. దేవదాయశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఆలయ కమిటీ సభ్యులుగా ఒకే కుటుంబానికి చెందిన వారిని తీసుకోవడంపై సీఎంకు ఫిర్యాదు చేశామన్నారు. నందకుమార్, శ్రీరాములు, మల్లికార్జున, గంగన్న, రామకృష్ణ, చిన్నరాయప్ప వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారని, కమిటీలో సభ్యులుగా ఎలా నియమించారో అర్థం కావడం లేదన్నారు. వీరందరి నుంచి తనకు ప్రాణహాని ఉందన్నారు.

గొంతు కోశారా.. తనే కోసుకున్నాడా?


గొంతు వద్ద రక్తంతో సోమశేఖర్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి పంచాయతీ సాన్నువారిపల్లికి చెందిన సోమశేఖర్ (40) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి వెళ్లిపోయారనే విషయం గురువారం సంచలనం రేకెత్తించింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమశేఖర్‌కు సంబంధించిన భూమిలోని ఇంటి స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి వేరే వ్యక్తికి 2023లో విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి సదరు స్థలంలో పునాదులు వేస్తుండగా సోమశేఖర్ అడ్డుకున్నాడు. ఈ విషయాన్ని అప్పట్లో పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వివాదాస్పదంగా మారిన స్థలాన్ని సర్వేయర్ కొలతలు వేయగా విక్రయించిన స్థలం సోమశేఖర్‌దేనని అధికారులు ధ్రువీకరించారు. అప్పటి నుంచి తన పరువు పోయిందని భావించిన ఉద్యోగి వారిపై కక్ష పెంచుకున్నాడు. అనంతరం కొంత కాలానికి ప్రభుత్వ ఉద్యోగి కొంత మందితో సోమశేఖర్ కుటుంబ సభ్యులపై దాడి చేయించి తీవ్రంగా గాయపరిచినట్లు సమాచారం. ఈ తరుణంలో ఇటీవల మళ్లీ కక్ష పెంచుకున్న ఉద్యోగి వారి సమీప బంధువైన మహిళను తెరమీదకు తెచ్చి పునాదులు మళ్లీ తవ్విస్తుండటంతో సోమశేఖర్ తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం మద్యం మత్తులో ఉన్న సోమశేఖర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి పరారైనట్లు తెలుస్తోంది. అయితే కుటుంబ కలహాల కారణంగా సోమశేఖరే మద్యం మత్తులో బ్లేడుతో గొంతు కోసుకుని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. కాగా పోలీసుల సమగ్ర దర్యాప్తులో వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

రెవెన్యూ రికార్డుల్లో జాడలేని చిట్టిబోయనపల్లె

- రైతు గుర్తింపు కార్డు కోసం రైతుల పడిగాపులు
- రోజుల తరబడి రైతుసేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు
- ఆన్‌లైన్‌లో కనిపించని చిట్టిబోయనపల్లె భూములు
- ఆందోళనలో రైతులు


గుర్రంకొండ రైతుసేవాకేంద్రంలో రైతు గుర్తింపుకార్డులకోసం అధికారుల వద్ద పడిగాపులు పడుతున్న చిట్టిబోయనపల్లె రైతులు

గుర్రంకొండ : మండలంలోని చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామం రెవెన్యూ రికార్డుల్లో కనిపించకుండా పోయింది. ఈ గ్రామానికి చెందిన రైతులు గుర్తింపు కార్డుల కోసం రోజుల తరబడి రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కనీసం ముటేషన్ చేద్దామనుకున్నా ఆన్‌లైన్‌లో చిట్టిబోయనపల్లె గ్రామానికి సంబంధించి వివరాలు కనిపించడం లేదు. ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామానికి చెందిన వందలాది ఎకరాల భూముల జాడే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

1800 ఎకరాలు 328 మంది రైతులు

మండలంలోని చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో మొత్తం 1800 ఎకరాలు భూములు ఉండగా అందులో 328 మంది రైతులు వ్యవసాయం చేసుకొంటున్నారు. 2005 సంవత్సరం ముందు వరకు అవి శ్రోత్రియం భూములుగా ఉంటూ అక్కడి రైతులకు తమ భూములపై ఎలాంటి హక్కులుగానీ, పట్టాదారుపాసుపుస్తకాలు గానీ ఉండేవి కావు. మండలంలోని అన్ని గ్రామాలకు ప్రభుత్వ పథకాలు అందినా చిట్టిబోయనపల్లె రైతులకు మాత్రం ఎలాంటి ప్రభుత్వ పథకాలుగానీ, పంటసాయంగానీ అందేవి కావు. 2005లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 50 ఏళ్ల శ్రోత్రియం భూముల సమస్యకు పరిష్కారం దొరికింది. అప్పట్లో ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఎవరైతే సదరు భూముల్లో చాలా కాలం నుంచి వ్యవసాయం చేసుకొంటున్నారో ఆ రైతులందరికి ఎనిమిది విడతలుగా పట్టాదారు పాసు పుస్తకాలను మంజూరు చేశారు. అప్పటి నుంచి రైతులకు అన్ని ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకుల్లో రుణాలు అందుతున్నాయి.

ఆన్‌లైన్‌లో నమోదు కాని రైతు గుర్తింపు కార్డులు..

మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. అయితే చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో మాత్రం ఇంతవరకు ఒక్కరైతుకు గుర్తింపు కార్డు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో చిట్టిబోయనపల్లెకు చెందిన రైతుల వివరాలు మొదట్లో నమోదు చేస్తున్నారు. భూమి పాసుపుస్తకం, రైతు ఆధార్ కార్డు నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాత రైతు సెల్‌ఫోన్‌కు రెండు సార్లు ఓటీపీలు వస్తున్నాయి. చివరగా వెబ్‌సైట్‌లో ల్యాండ్ మార్కింగ్ దగ్గరకి వెళితే మాత్రం చిట్టిబోయన పల్లె రెవెన్యూ గ్రామానికి సంబంధించిన భూముల వివరాలు గానీ, సర్వే నంబర్లుగానీ చూపించడంలేదు. ప్రతిరోజు ఎన్ని మార్లు ప్రయత్నించినా చివరకు ఇదే ఫలితం వస్తోందని సిబ్బంది, రైతులు వాపోతున్నారు.

గడువు ముగుస్తుండడంతో రైతుల ఆందోళన..

రైతుగుర్తింపు కార్డు నమోదు, జారీ ప్రక్రియ గడువు ముగుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పది రోజులుగా మండలంలో రైతు గుర్తింపు కార్డు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే మండల వ్యాప్తంగా 3548 మంది రైతు గుర్తింపు కార్డులు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఈనెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం గడువు విధించింది. అయితే చిట్టిబోయనపల్లె రైతులకు మాత్రం ఇంతవరకు ఒక్కరికి కూడా గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ జరగలేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రోజుల తరబడి రైతుసేవాకేంద్రాల వద్దకు వెళ్లడం అక్కడే పడిగాపులు కాయడంతోనే రోజంతా గడిచిపోతోంది. నిర్ణీత గడువులోగా గుర్తింపుకార్డులు ఇవ్వలేక పోతే తమ పరిస్థితి ఏంటని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరోవైపు తహసీల్దార్ కార్యాలయంలోనూ చిట్టిబోయనపల్లె భూములకు సంబంధించి ఎలాంటి ముటేషన్లు జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలోని భూములకు సంబంధించి సమస్య చాలా కాలంగా ఉందనే విషయం ఇప్పుడు వెలుగు చూడడం గమనార్హం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో రైతులకు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ జరగడం లేదనే విషయం జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గత పది రోజులుగా సమస్య ఉంది. రైతులు రోజూ రైతు సేవా కేంద్రాలకు వచ్చి వెళుతున్నారు. రైతుల వద్ద నుంచి తాము జిరాక్స్ కాపీలను తీసుకొని వెబ్‌సైట్‌లో సమస్య పరిష్కారం కాగానే సమాచారం అందిస్తామని చెప్పి పంపిస్తున్నాము. నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.
– రత్నమ్మ, ఏఓ, గుర్రంకొండ.

ముటేషన్లు కావడం లేదు



చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో రైతుల పొలాలకు సంబంధించి ముటేషన్లు కూడా కావడం లేదు. రైతుగుర్తింపు కార్డుల జారీలో చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వ్యవసాయాధికారులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లోనే సమస్య ఉన్నట్లు గుర్తించాము. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. త్వరలోనే సమస్యను పరిష్కరించి రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు సహకరిస్తాము.
– శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ.